ఉష్ణోగ్రత (అంచనా)

30-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	27
తెనాలి	34	27
నరసరావుపేట	33	27
బాపట్ల	34	28
రెంటచింతల	35	27
చీరాల	34	28

విద్యాకిట్లు.. వచ్చేశాయ్





- ఎమ్మార్సీ కేంద్రాలకు చేరిన విద్యా కిట్లు
- ఈ ఏడాది నుంచి రెండు సెమిస్టర్ల విధానం
- ప్రభుత్వ బడుల్లో తగ్గనున్న బ్యాగ్ బరువు

గుంటూరు (విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్నది. బడి ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రెండు వారాలు ముందుగానే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా కేంద్రాలకు పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్‌ను ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని ఆయా మండలాల పరిధిలోని విద్యా వనరుల కేంద్రాలకు తరలించేందుకు జిల్లాస్థాయిల్లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో విద్యా వనరుల కేంద్రాలకు ఆయా పుస్తకాలను తరలించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లు పేరుతో ప్రభుత్వం ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పంపిణీ చేయనున్నది. ఈ కిట్లలో రెండు స్కూల్ యూనిఫామ్, బ్యాగు, బూట్లు, టై తదితరాలతో పాటు తరగతుల వారీగా పాఠ్య, నోట్ పుస్తకాలు, డిక్షనరీ ఉంటాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో మండల పరిషత్, ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ యాజమాన్యాల ఆధ్వర్యంలో దాదాపు వెయ్యికి పైగా (మిగతా 6లో)

11 మంది హస్తం.. అదుపులో 9 మంది?

జంట హత్యల నిందితుల వేటలో పోలీసులు

మాచర్లటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో 11 మంది హస్తం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఇప్పటికే 9 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మూడు బృందాలుగా ఏర్పడిన పోలీసులు సెల్ టవర్స్ లోకేషన్ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. వెల్దుర్తి మండలం రామచంద్రాపురంతండా కృష్ణానది ఒడ్డున ముగ్గురు ప్రధాన నిందితులను, గుండ్లపాడులో నలుగుర్ని, గుంటూరులో ఒకరిని, హైదరాబాద్‌లో ఒకరిని అదుపులోకి తీసుకుని రహస్య రాణాలో విచారిస్తున్నట్లు తెలిసింది. జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరావులతో కలిసి వెళ్లిన బంధువుల్లోని ఓ వ్యక్తి ద్వారా ఫోన్‌లో సమాచారం తెలుసుకుని పథకం ప్రకారం హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సుమారు రూ.5 లక్షల చొప్పున నలుగురి బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో నిందితులను కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు సమాచారం.

జిల్లాలో భారీ వర్షాలు

పొంగిపొర్లిన వాగులు, చప్టాలు

నరసరావుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): రోహిణికార్తె రోళ్లు పగిలే ఎండలు కాస్తాయంటారు. కానీ గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడి వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా మారింది. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో రుతు పవనాలు జిల్లాకు విస్తరించాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిశాయి. నకరికల్లు మండలం చాగల్లు ప్రాంతంలో 70 మీమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సత్తెనపల్లి పట్టణంలో 62.5 మీమీ, సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్లలో 48 మీమీ, క్రోసూరు మండలం గరికపాడులో 41 మీమీ, మాచర్ల మండలం తాళ్లపల్లిలో 18.5 మీమీ, నందిగామలో 16.5 మీమీ, అమరావతి మండలం నెమలికల్లులో 14.5 మీమీ, దాచేపల్లి మండలం మాడుగులలో 14 మీమీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో రాజుపాలెం మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. ఎద్దువాగు పొంగిపొర్లింది. సత్తెనపల్లి పట్టణంలో జోరుగా కురిసిన వర్షంతో పలు వీధుల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది. పిడుగురాళ్లలో మధ్యాహ్నం 1 గంటకు మొదలుకొని సాయంత్రం 5 గంటల వరకు ఎడతెరపి లేకుండా వర్షం పడింది. మాచవరం మండలంలో వేమవరం, చెన్నాయపాలెం, మాచవరం, పిన్నెల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బెల్లంకొండ మండలంలో భారీ వర్షానికి చప్టాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



సత్తెనపల్లి : ఆర్టీసీ గ్యారేజీలో నిలిచిన వర్షపు నీరు



రాజుపాలెం : గుంటూరు-మాచర్ల రహదారిపై రెడ్డిగూడెం సమీపంలో ఉన్న లో లెవల్ చప్టావద్ద పొంగిపొర్లుతున్న వర్షపు నీరు

ఖరీఫ్‌పై... కదలరా?



- విత్తన కేటాయింపుల్లో రాని స్పష్టత
- కొలిక్కిరాని కాల్వల మరమ్మతుల పనులు
- రైతులు సిద్ధమైనా వ్యవసాయశాఖలో లోపించిన సన్నద్ధత
- పంటల డిమాండ్‌పై రైతులకు దిశానిర్దేశం చేసే వారే కరువు
- విత్తన నాణ్యత ధ్రువీకరణ నుంచి భూసార పరీక్షల వరకు నిర్లక్ష్యం

వరుణుడు కరుణించాడు.. మేఘాలు వర్షిస్తున్నాయి.. చినుకులతో భూమాత పులకిస్తోంది.. రైతులు ముందస్తు సాగుకు సన్నద్ధమవుతున్నాడు.. అయితే ప్రభుత్వ పరంగా యంత్రాంగంలో ఖరీఫ్‌పై ఇంతవరకు కదలికే లేదు. గత రెండు సీజన్లలో ఆలస్యంగా ఖరీఫ్ ఆరంభం కావడం.. దిగుబడులు చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో రైతులు చాలావరకు నష్టపోయారు. ఈ ఏడు ముందస్తు రుతుపవనాలతో ముందస్తుగా సాగు చేపట్టి ప్రకృతి వైపరీత్యాలను తప్పించుకోవాలని రైతులు ఆశించగా యంత్రాంగం నుంచి సహకారం లేదని తేటతెల్లమవుతోంది. విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలు, విత్తన నిర్ధారణ పరీక్షలు, కాల్వల మరమ్మతులు.. ఇలా అన్ని విషయాల్లోనూ ఆయా విభాగాల అధికారుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ముందస్తు ఖరీఫ్ సత్ఫలితాలు సాధించాలంటే ఆయా విభాగాల మధ్య సమన్వయం కూడా ఎంతో కీలకం. ప్రస్తుతం అది లోపించడం కూడా అన్నదాతలకు శాపంగా మారింది. వ్యవసాయ, ఉద్యాన శాఖలతో పాటు ఇరిగేషన్ విభాగాలు సమన్వయంతో అడుగులు వేయాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో ఇదెక్కడా కనబడటంలేదు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏటా జూన్ మూడో వారంలో ఖరీఫ్ ఊపందుకుంటోంది. అయితే ప్రస్తుతం వానలు ముందుగానే పలకరించాయి. దీంతో ఖరీఫ్ పనులు జూన్ ఆరంభం నుంచే ప్రారంభం కానున్నాయి. ముందస్తు ఖరీఫ్ సాగు చేపట్టడం ద్వారా ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చే ప్రకృతి విపత్తులను కొంతమేర తప్పించుకోవచ్చు. దీంతో పాటు ఖరీఫ్ ముందస్తు సాగు ద్వారా సీజన్‌లో మూడో పంట సాగును రైతులు చేయవచ్చనేది ఈ ముందస్తు ప్రణాళికల్లో భాగం. అయితే ఇందుకు కావాల్సిన అన్ని సహాయ సహకారాలను వ్యవసాయ శాఖ నుంచి ప్రభుత్వం కల్పిస్తుందని అన్నదాతలకు భరోసా ఇచ్చారు. కానీ ఆశించిన స్థాయిలో ముందస్తు ఖరీఫ్‌పై సదరు విభాగం సన్నద్ధత కనబడడం లేదు. విత్తనాల నాణ్యతను ఈ సారి పూర్తి స్థాయిలో పరిశీలించాలనే ఆదేశాలు ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చింది. కానీ ఆ దిశగా ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో వరి, మిరపతో పాటు పత్తి పెద్దఎత్తున సాగు చేస్తుంటారు. ఆయా కంపెనీలు సీజన్ ఆరంభంలోనే విత్తన నాణ్యత ధ్రువీకరణ పత్రాలను వ్యవసాయశాఖకు (మిగతా 6లో)

ఖరీఫ్ సాగు విస్తీర్ణం

బాపట్ల జిల్లాలో మొత్తం 2,67,469 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్ సాగు ఉండనుందనేది వ్యవసాయ శాఖ అంచనా. దీనికి 65,000 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు అదనం. గుంటూరు జిల్లాలో 1.24 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయనే అంచనా. పల్నాడు జిల్లాలో 4.60 లక్షల ఎకరాలుగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం ఎత్తైతే మిగులు వర్షపాతం నమోదవుతుందనే అంచనాలను ఐఎండీ చెబుతుండడంతో రైతులు ఖరీఫ్ సాగుపై పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు.

ఇలాగైతే ఎలా?

- ఇప్పటి వరకూ విత్తన నాణ్యత పరిశోధన జాడేలేదు.
- ఏ పంట సాగుకు మట్టి అనుకూలమో చెప్పే భూసార పరీక్షలు ప్రహసనాన్ని తలపిస్తున్నాయి తప్పితే రైతులకు జరిగే మేలు శూన్యంగా కనబడుతోంది.
- రాయితీ విత్తనాలు, ఎరువుల నిల్వలపై ఇప్పటికీ వ్యవసాయశాఖ దగ్గర ఓ నిర్దిష్ట ప్రణాళిక లేదు.
- కాల్వల మరమ్మతుల పనులు ప్రారంభమైనా నిర్దిష్ట గడువు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.
- సీసీఆర్‌సీ కార్డులు, సేద్యానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళికలు కార్యరూపం దాల్చలేదు.

దీపం-2 నగదేది?

- రెండు నెలలైనా అందని సొమ్ము
- ఇప్పటికే పూర్తయిన లక్షలాది బుకింగ్స్
- నగదు కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- తొలివిడతలో వెంటనే.. జాడలేని రెండోవిడత

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో దీపం-2 పథకం రెండో విడత నగదు రెండు నెలలుగా అమలుకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభు త్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించినా రెండో విడతలోనే పిల్లిమొగ్గలు వేసిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. తొలివిడత ఉచిత సిలిండర్ కింద లబ్ధిదారులకు బుక్ చేసుకున్న వెంటనే అందిన నగదు రెండో విడతలో ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గత నవంబరులో దీపం- 2 పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం 2025 మార్చి 31 వరకూ స్కీమును అమలు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో ఒక్కొక్కరికి రూ.835 చొప్పున రూ.116 కోట్లు చెల్లించింది. తొలివిడత గ్యాస్ సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోనే లబ్ధిదారుల ఖాతాలో నగదు పడింది.

● ఈ ఏడాది తొలి సిలిండర్ డబ్బులేవి?

ఈ ఏడాది తొలి ఉచిత సిలిండర్ పొందేందుకు ఏప్రిల్ 1 నుంచి జూలై నెలాఖరు వరకూ గడువును నిర్ణయించింది. అయితే దీనికి సంబంధించిన నిధులు ఇప్పటి వరకూ లబ్ధిదారులకు అందలేదు. తొలివిడత ఉచిత సిలిండర్ పొందిన 14 లక్షల మంది లబ్ధిదారుల్లో సగం మంది ఏప్రిల్, మే నెలల్లోనే బుకింగు చేసుకున్నా చాలామందికి రెండు నెలలైనా (మిగతా 6లో)



కౌన్సెలింగ్.. కాలయాపన

- గందరగోళంతో ఉపాధ్యాయ సంఘాల ఆందోళన
- కమిషనరేట్ ఆదేశాలతో అర్ధరాత్రి వరకు సాగిన ప్రక్రియ

గుంటూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరుకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కౌన్సెలింగ్ గురువారం స్థానిక భారతీయ విద్యా భవన్‌లో జరిగింది. మొత్తం 59 పోస్టులకు 1:3 నిష్పత్తిలో 200 మంది ఉపాధ్యాయులను బుధవారం కౌన్సెలింగ్‌కు పిలిచారు. అయితే సాంకేతిక కారణాల వల్ల కౌన్సెలింగ్‌లో జాప్యం చోటుచేసుకుంది. అసహనానికి గురైన ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. గురువారం కౌన్సెలింగ్ ఉంటుందని రావాలని బుధవారం సాయంత్రం ఉపాధ్యాయులకు సమాచారం పంపారు. ఉదయం 8 గంటలకే ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే సాయంత్రం వరకు కూడా కమిషనరేట్ నుంచి పదోన్నతుల కోసం అనుమతి రాలేదు. కౌన్సెలింగ్‌లో జరుగుతున్న కాలయాపన, గందరగోళంతో అసహనానికి గురైన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతృత్వంలో ఆందోళనకు దిగారు. వయోభారం కారణంగా పలువురు ఇబ్బందులు పడుతున్నారని అయినా విద్యాశాఖ స్పందించడం లేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించకపోగా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. అయితే కౌన్సెలింగ్‌కు సంబంధించిన ఆదేశాలు గురువారం సాయంత్రం ఏడు గంటలకు రాగా అప్పటికప్పుడు కౌన్సెలింగ్ చేపట్టారు. దీంతో గురువారం పొద్దుపోయే వరకు ప్రక్రియ కొనసాగింది.



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

నరసరావుపేట మున్సిపాల్టీ.. సెలక్షన్ గ్రేడ్

- హోదా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- పెరగనున్న ఉద్యోగుల సంఖ్య.. నిధుల కేటాయింపు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

110 ఏళ్ల చరిత్ర ఉన్న నరసరావుపేట మున్సిపాల్టీ హోదా పెరిగింది. జిల్లా కేంద్రమైన నరసరావుపేట మున్సిపాల్టీ సెలక్షన్ గ్రేడ్‌గా స్థాయిని ప్రభుత్వం పెంచింది. మొదటి గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ హోదా ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జనాభా, ఆదాయం, విస్తీర్ణం పరిగణనలోకి తీసుకుని నరసరావుపేటకు సెలక్షన్ గ్రేడ్ హోదా ఇచ్చింది. హోదా మార్పుతో అధికారులు, ఉద్యోగుల సంఖ్య పెరగనున్నది. అదేవిధంగా నిధుల వాటాను కూడా ప్రభుత్వం పెంచనుంది.

ఇదీ చరిత్ర..

నరసరావుపేట పంచాయతీ నుంచి 1915లో మున్సిపాల్టీగా ఏర్పడింది. 1960లో ద్వితీయ శ్రేణి, 1980లో మొదటి శ్రేణి మున్సిపాల్టీగా అప్‌గ్రేడైంది. 45 ఏళ్ల అనంతరం సెలక్షన్ గ్రేడ్ మున్సిపాల్టీ హోదా లభించింది. మున్సిపాల్టీలో మూడేళ్ల క్రితం శివారు ప్రాంతాలను విలీనం చేశారు. దీంతో 9 కిలోమీటర్ల నుంచి 14 కిలో మీటర్లుకు పట్టణం విస్తరించగా జనాభా సూమారు 1.50 లక్షలకు చేరింది. వార్షిక ఆదాయం రూ.30 కోట్లకు పెరిగింది. ఈ నేపథ్యంలో హోదా పెంచాలని కోరుతూ ఏప్రిల్‌లో మున్సిపాల్టీ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సెలక్షన్ గ్రేడ్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాల్టీ హోదా పెరగడంతో విలీన ప్రాంతాల్లో కూడా మౌలిక వసతుల కల్పనకు దోహదపడనున్నది.

పారదర్శకంగా ఉపాధి పనులు

డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి ఆదేశాలు

శావల్యాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేస్తున్న ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మండలంలోని బొందిలిపాలెం, వేల్పూరు గ్రామాల్లో జరుగుతున్న పనులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలు పనులకు రాగానే హాజరు వేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద నిర్మించిన నీటికుంటను, చెక్‌డ్యాంలో పూడికతీత పనులను పరిశీలించారు. వేల్పూరులో గోకులం షెడ్లు, నీటి తొట్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. జిల్లాలో రోజుకు 2.50 లక్షల మందికి పని దినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా 1.10 లక్షల మంది హాజరవుతున్నారన్నారు. 1158 నీటికుంటలకు 908 పూర్తయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామయ్య, ఏపీవో కటారపు రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



బొందిలిపాలెంలో నీటికుంటను పరిశీలిస్తున్న డ్వామాపీడీ సిద్ధలింగమూర్తి



మక్కెన మల్లికార్జునరావు

జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా మక్కెన

● అధికారిక ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

8

ముదురు పత్తి సాగుకు మొగ్గు

దిగుబడి ఎక్కువ.. పెట్టుబడి తక్కువ

మాచర్లటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువతో ముదురు పత్తి సాగుకు ఎక్కువగా రైతులు మొగ్గు చూపుతున్నారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని కారంపూడి, దుర్గి, మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల మండలాల్లో రైతులు వ్యవసాయ బోర్ల కింద ముదురుపత్తి సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. చీడ, పీడలు, గులాబీ రంగు పురుగు తాకిడి నుంచి తట్టుకుని దిగుబడి అధికంగా లభిస్తుండటంతో ఇరవై ఏళ్లుగా వేసవిలో పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ పరిధిలో సుమారు 2 వేల హెక్టార్లలో పత్తిని సాగు చేశారు. సాధారణంగా జూన్, జూలైలో తొలకరి వర్షాలతో పత్తి వేస్తుంటారు. ఇలా సాగు చేసిన పంటకు చీడపీడలు తాకిడి అధికం గా ఉండడంతో రైతులు నష్టపోతు న్నారు. ఈ క్రమంలో సాంప్రదాయకంగా బోర్ల కింద ఏప్రిల్‌లో పత్తి సాగుతో ఆగస్టుకి దిగుబడులు రావడంతో రైతులకు మేలు జరుగుతుంది. మరికొందరు రైతులు సెప్టెంబరుకి ముదురుపత్తిని పీకేసి కంది, మొక్కజొన్న సాగు, మిర్చి వేసి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.



ఏపుగా పెరిగిన ముదురుపత్తి పైరు

నాలుగు రైళ్ల పాక్షిక రద్దు

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ బ్లాక్ కారణంగా నాలుగు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు గుంటూరు డీఆర్ఎం సుధేష్ట సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. (17254) ఔరంగబాద్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 20వ తేదీ వరకు ఔరంగబాద్ నుంచి కాకుండా జల్నా స్టేషన్ నుంచి బయలుదేరి గుంటూరుకు వస్తుంది. (17253) గుంటూరు - ఔరంగబద్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుండి సెప్టెంబరు 19వ తేదీ వరకు జల్నా స్టేషన్ వరకే ప్రయాణించి ఆగిపోతుంది. (17243)గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ జూన్ 1న విజయనగరం వరకే ప్రయాణించి ఆగిపోతుంది. ఈ కారణంగా (17244) రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ 2న రాయగడ నుంచి కాకుండా విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరుకు వస్తుంది. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని డీఆర్ఎం పేర్కొన్నారు.

గృహోపకరణాల గిడ్డంగిలో అగ్నిప్రమాదం

పెదకాకాని, మే 29(ఆంధ్రజ్యోతి): ఆటో నగర్ లోని ఓ ప్రైవేట్ గిడ్డంగిలో అ గ్ని ప్రమాదం జరిగిం దని పెదకా కాని సీఐ నారా యణస్వామి గురువారం తెలిపారు. ఆటోనగర్‌లోని లారీ స్టాండ్ రోడ్డు సమీపంలో గుంటూరుకు చెందిన ప్రైవేటు వ్యాపారి ఒక గిడ్డంగిలో స్టాక్ పాయింట్ పెట్టుకున్నారు. అందులో ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మిషన్లు ఇతర గృహోపకరణాల స్టాకు పెట్టారు. గత అర్ధ రాత్రి జరిగిన ప్రమాదంలో స్టాక్ మొత్తం కాలి బూడిదైంది. వాచ్‌మెన్ వేణు గమనించి షాప్ యజమానులకు తెలియజేశాడు. వారు వచ్చి చూసే సరికి మొత్తం కాలిపోయింది. సమాచారం అందుకున్న గుంటూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.3 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మిర్చియార్డులో.. కొత్త నీరు

- వేర్వేరు ఏఎంసీల నుంచి తొమ్మిది మంది సూపర్‌వైజర్లకు పోస్టింగ్
- గుంటూరు వచ్చేందుకు ఆసక్తి చూపని గ్రేడ్-2, 3 సెక్రటరీలు, యూడీసీలు
- పూర్తిస్థాయి సిబ్బంది లేకుండా రూ.100 కోట్ల సెస్సు వసూళ్లు సాధ్యమా!

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో సిబ్బందిని సమూలంగా మార్చిన మార్కెటింగ్ శాఖ.. వారి స్థానంలో కొత్తవాళ్లని పోస్టింగ్ చేసేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో పోస్టింగ్ అంటే ఎగురుకుంటూ వచ్చే సిబ్బంది.. ప్రస్తుతం విజిలెన్స్ కేసులు కారణంగా వెనకడుగు వేస్తున్నారు. మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించగా గుంటూరు ఎవరైనా వెళతారా అని అడిగితే చాలామంది నుంచి మౌనమే సమాధానంగా వచ్చింది. కొద్దిమంది మాత్రమే ముందుకు వచ్చారు. తెనాలి, నరసరావుపేట, గన్నవరం, బాపట్ల, ప్రత్తిపాడు, ఫిరంగిపురం, నూజివీడు నుంచి సూపర్‌వైజర్లు గుంటూరు ఏఎంసీకి వచ్చేందుకు ఆసక్తి చూపించారు. దాంతో వారికి ఇట్టే పోస్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు సిద్ధం చేశారు.

విజిలెన్స్ విచారణలతో వెనకడుగు..

గుంటూరు ఏఎంసీలో సూపర్‌వైజర్ల పాత్ర ఎంతో కీలకం. మిర్చి యార్డు, కోల్డ్‌స్టోరేజ్‌లు, పత్తి జిన్నింగ్ మిల్లుల్లో జరిగే లావాదేవీల పర్యవేక్షణ వీరి కనుసన్నల్లోనే ఉంటుంది. అయితే గత ప్రభుత్వంలో దాదాపుగా రూ.347 కోట్ల ఆదాయం మిర్చి యార్డుకు గండి పడిందని, అందుకు కారణం సూపర్‌వైజర్లు, సెక్రటరీలేనని పేర్కొంటూ విజిలెన్స్ రిపోర్టు ఇవ్వడంతో 18 మందిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. విజిలెన్స్ రిపోర్టులో ఉన్న వాళ్లందరిని సాగనంపింది. కాగా, ఇప్పుడు తెనాలి నుంచి బాజీబాబు, గౌస్‌బాషా, సుజాత, సంజీవరావు (నరసరావుపేట), కళావతి(నరసరావుపేట), నాగమణి (గన్నవరం), మోహన్‌రావు (బాపట్ల), వెంకటరత్నం (ప్రత్తిపాడు), చంద్రశేఖర్ (ఫిరంగిపురం)కు కమిషనర్ పోస్టింగ్‌లు కల్పించారు. నూజివీడులో గ్రేడ్-3 సెక్రటరీగా ఉన్న నరసింహారావు కూడా గుంటూరు వచ్చేందుకు ఆసక్తి చూపడంతో ఆయన పేరుని ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదించారు. అయితే ఇంకా 9 సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. వాటిల్లోకి వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు మిర్చి యార్డుకు రూ. 100 కోట్లకు పైగా మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ ఇదివరకే నిర్దేశించింది. పూర్తిస్థాయి సిబ్బంది లేకుండా ఏ విధంగా లక్ష్యాన్ని అధిగమిస్తారో అధికారులకే తెలియాలి.

సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీల బదిలీలు

మార్కెటింగ్ శాఖలో సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీలుగా వివిధ ఏఎంసీలలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు కూడా బదిలీల కౌన్సెలింగ్ పూర్తి అయింది. చిలకలూరిపేట సెక్రటరీ యోగేశ్వరరావు ఆకివీడుకు, ఆకివీడులో ఉన్న డీసీహెచ్ సుబ్బారావు తెనాలికి, తెనాలిలో ఉన్న జేవీ సుబ్బారావుని దుగ్గిరాలకు, భీమవరం సెక్రటరీ ప్రసన్నకుమారికి పొన్నూరు, దుగ్గిరాల సెక్రటరీ ఎం.శ్రీనివాసరావుని కొవ్వూరుకు , పల్నాడు ఏడీఎం సూర్యప్రకాష్‌రెడ్డి అద్దంకి సెక్రటరీగా, ఒంగోలు ఏడీఎం ఉపేంద్ర నరసరావుపేటకు, బాపట్ల ఏడీఎం రమేష్ గుంటూరు ఏడీఎంగా పోస్టింగ్‌లు కోరుకొన్నారు. అలానే అనంతపురం ఏడీఎం సత్యన్నారాయణ చౌదరి కూడా గుంటూరు ఏడీఎంగా పోస్టింగ్ కోరుకొన్నారు. వీటన్నింటిపై ప్రిన్సిపల్ సెక్రటరీ తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఉత్తమ ప్రదర్శనగా అమ్మ చెక్కిన బొమ్మ



అమ్మ చెక్కిన బొమ్మ ప్రదర్శనకు ప్రథమ బహుమతి ప్రదానం

నాదెండ్ల, మే29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామ ంలో గడిచిన నాలుగు రోజులుగా జరుగుతున్న తృతీయ జాతీయ స్థాయి నాటిక పోటీలు కోలాహ లంగా గురువారం ముగిశాయి. ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియే షన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ అనే నాటిక నిలిచింది. ద్వితీయ ప్రదర్శనగా జనరల్ బోగీలు, తృతీయ ప్రదర్శనగా విడాకులు కావాలి అనే నాటికలు బహుమతులు సాధించాయి. ఉత్తమ హాస్య నాటికగా మా ఇంట్లో భార తం ప్రథమ బహుమతి సాధించింది. ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా గంగోత్రి సాయి, నటిగా సురభి పద్మావతి నిలిచారు. ఉత్తమ బాల నటులుగా నూర్ గుల్షర్ రోషన్, చల్లా మోహిత్ నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా డి.రామ సత్యనారాయణ, బొర్రా నరసయ్య, కూచి రామాంజనేయులు వ్యవహరించారు. కాగా బహుమతులు, జ్ఞాపికలను డాక్టర్ శరత్ చంద్ర, నటరత్న ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి సత్యనారాయణ, నడింపల్లి వెంకటేశ్వరరావు, నిర్వాహకులు గరికపాటి వెంకట రామారావు, వజ్జా మధుసూదనరావు ప్రదానం చేశారు.

6 వేల మందికి.. ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చిలకలూరిపేట, మే29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి నుంచి రెండు బస్సుల్లో డాక్టర్లు, సిబ్బంది శిబిరానికి తరలివచ్చి రోగులను పరీక్షించారు. లక్ష్మీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ నిర్వాహకుడు వడ్లమూడి రవీంద్ర ఆధ్వర్యంలో 50 మంది నర్సింగ్ విద్యార్థులు, రాష్ట్ర ఆర్ఎంపీల సంఘం నాయకులు మురళి, జాకబ్ ఆధ్వర్యంలో 50 మంది ఆర్ఎంపీలు సహాయ సహకారాలు అందజేశారు. శిబిరం కో-ఆర్డినేటర్ కంచర్ల శ్రీనివాసరావు నేతృత్వంలో, టీడీపీ సీనియర్ నేత సదాశివరావు పర్యవేక్షణలో 6,800 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 2 వేల మందికి శస్త్ర చికిత్సలు అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. వారికి కేటాయించిన తేదీల్లో జూన్ 12వ తేదీ వరకు శంకర కంటి ఆసుపత్రికి బస్సుల్లో తరలించి అక్కడ ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారు. మొత్తం సుమారు 13 వేల మందికి భోజన సౌకర్యం కల్పించారు. అర్బన్ సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఖరీఫ్‌పై కదలరా?

(5వ పేజీ తరువాయి)

అందించాలి. కానీ ఇందుకు సంబంధించిన సమాచారం ఏదీ కూడా వ్యవసాయశాఖ వద్ద అందుబాటులో లేదు. బాపట్ల జిల్లాలో 700, గుంటూరు జిల్లాలో 1400, పల్నాడులో 1500 విత్తన నమూనాలను సేకరించి పరీక్షలు జరపాల్సి ఉండగా ఇప్పటి వరకు ఇందులో 25 శాతం లక్ష్యాలను కూడా చేరుకోలేదు. మూడు జిల్లాల పరిధిలో దాదాపు 60,000 మట్టి నమూనాలు సేకరించి వాటి ఫలితాలను ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందు రైతులకు అందించాల్సిన వ్యవసాయశాఖ ఇప్పటి వరకు ఇందులో 30 శాతం లక్ష్యాలను కూడా చేరుకోకపోవడం ఖరీఫ్ సన్నద్ధతపై సదరు శాఖ నిర్లక్ష్యానికి సూచికగా కనబడుతోంది. రాయితీ విత్తనాలకు సంబంధించి రైతు సేవా కేంద్రాల వారీగా వచ్చిన ఇండెట్లు ఎన్ని? నిల్వలు ఎంతనే దానిపై ఆయా విభాగాల వద్ద ఇప్పటికీ స్పష్టత లేదు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు సమృద్ధిగా అందాలంటే కాల్వల మరమ్మతుల పనులు పూర్తి కావడం అత్యంత కీలకం. అయితే ఆశించిన స్థాయిలో పనులు వేగంగా జరగడం లేదని రైతులు చెప్తున్నారు. సాగు పనులు ప్రారంభమైన తర్వాత కాల్వల ద్వారా నీరు రాకపోతే పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేసేలా అన్నదాతలను చైతన్య పరచాల్సిన బాధ్యత ఆయా విభాగాలదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు మూడు జిల్లాల పరిధిలో ఒక్కటంటే ఒక్క అవగాహన సదస్సు కూడా ఈ అంశంపై నిర్వహించిన దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో రైతులు తమకు తోచిన పైరునో లేక గతేడాది ధర ఆధారంగానో ఎంచుకుంటే ఏటా నష్టపోయే పరిస్థితులు ఎదురవుతాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.

విద్యాకిట్లు వచ్చేశాయ్

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు ఉండగా ఒకటి నుంచి పదో తరగతి వరకు 6.70 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఉచితంగా విద్యా కిట్లు, పాఠ్యపుస్తకాలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు ఉపశమనం

ఈ విద్యా సంవత్సరం నుంచి రెండు సెమిస్టర్ల విధానం అమలు కానున్నది. పుస్తకాలు ఇచ్చే విధానంలో కూడా మార్పులు చేయనున్నారు. దీంతో విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గనున్నది. ఒకటి, రెండు తరగతులకు తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒక పుస్తకం, వర్క్‌బుక్ ఒకటి ఇవ్వనున్నారు. మూడు నాలుగు, ఐదు తరగతులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒక పుస్తకం, గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి ఒక పుస్తకంగా ఇవ్వనున్నారు. ఆరు ఏడు తరగతులకు తెలుగు ఆంగ్లం హిందీ ఒక పుస్తకంగా, గణితం భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, రసాయన శాస్త్రం కలిపి ఒక పుస్తకంగా, సోషల్ స్టడీస్‌లో చరిత్ర, భౌగోళిక శాస్త్రం అర్థశాస్త్రం కలిపి ఒక పుస్తకంగా అందించనున్నారు. పదో తరగతి విద్యార్థులకు కూడా సెమిస్టర్ వారీగా పుస్తకాలు ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. దీనివల్ల పుస్తకాల బరువు భారీగా తగ్గనున్నట్లు ఉపాధ్యాయులు చెప్తున్నారు.

దీపం-2.. నగదేది?

(5వ పేజీ తరువాయి)

నగదు అందలేదు. పల్నాడు జిల్లాలో 2 లక్షల 86వేలకి 88,196 మందికి మాత్రమే ఇప్పటి వరకూ నగదు జమైంది. గుంటూరు జిల్లాలో 3 లక్షల 8 వేల మందిలో లక్షా 45వేల మందికి మాత్రమే నగదు పడింది. బాపట్ల జిల్లాలో 2,20,568 మందిలో అత్యధిక మందికి నగదు జమకాలేదు. గ్యాస్ బుకింగులు పూర్తై రెండు నెలలు కావస్తున్నా దీపం- 2 పథకం నిధులు జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

వారంలోపు జమ

గడిచిన రెండు నెలలుగా గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న లబ్ధిదారులకు త్వరలోనే నగదు జమ అవుతుంది. నిధులు కూడా అందుబాటులోకి వచ్చాయి. కొన్ని సాంకేతిక కారణాల వల్లే పంపిణీ ఆగింది. ఈ వారంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమవుతుంది.

-చంద్రముని, డీఎస్‌వో(ఎఫ్ఏసీ)

వివాహిత ఆత్మహత్య కేసులో.. నిందితుడి అరెస్ట్

తెనాలి రూరల్, మే29 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ఆనంద్ గురువారం వివరాలు వెల్లడించారు. మండలంలోని గుడివాడకు చెందిన వివాహిత అదే గ్రామంలో కొళ్ల ఫారంలో రోజువారి కూలీగా పనిచేస్తూ జీవిస్తోంది. గ్రామానికే చెందిన రౌడీషీటర్ పాలపర్తి మహేష్ ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటబడేవాడు. తన వెంటపడవద్దని ఆ మహిళ ఎన్నిసార్లు చెప్పినా ప్రవర్తన మార్చుకోలేదు. ఆమె ఫోన్ నంబరు తీసుకుని అసభ్యంగా మాట్లాడేవాడు. అతడి ఆగడాలు తట్టుకోలేక విషయాన్ని బాధితురాలు తను పనిచేసే చోట యజమానికి చెప్పింది. దీంతో మహేష్‌ను పిలిపించి మందలించగా.. కొన్నిరోజుల దూరంగా ఉండి.. తర్వాత వివాహితను వెంబడించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయాన్ని బాధితురాలు భర్తకు తెలపడంతో మహేష్ ఇంటికి వెళ్లి మందలించే ప్రయత్నం చేశాడు. దీంతో మహేష్, అతడి తల్లి ఇద్దరూ కలిసి.. వివాహితతో అక్రమ సంబంధం ఉందని ఊరంతా ప్రచారం చేయడంతో.. ఆమె మనస్థాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత నెల 24న మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని గుడివాడలో అదుపులోకి తీసుకుని కోర్టు ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మించాలి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి



టీడీపీ చైర్మన్ బీఆర్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాజీ చౌదరి

నకరికల్లు, మే 29 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి నూతన దేవస్థానం, కల్యాణ మండపాన్ని నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో నిర్మించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును తిరుమలలో కలసి వినతిపత్రం అందజేసినట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి కోరారు. దేవాలయ నిర్మాణానికి, కల్యాణ మండప నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని దాతలు లేదా గ్రామస్తులు సమకూరిస్తే తప్పకుండా నిర్మాణం చేయిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయడు తెలిపారని బాజీ చౌదరి వివరించారు. టీటీడీ చైర్మన్‌ను కలసిన వారిలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, టీడీపీ సీనియర్ నేత గోగినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అనుభవం రాష్ట్రాభివృద్ధికి మార్గదర్శకం

సత్తెనపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రబాబునాయుడు అనుభవం రాష్ట్రాభివృద్ధికి మార్గదర్శకం అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌ను సైబరాబాద్‌గా మార్చి ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు అపార అనుభవం, దూరదృష్టి కలిగిన నాయకత్వం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

చంద్రబాబుకు కన్నా శుభాకాంక్షలు

సత్తెనపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నారా చంద్రబాబునాయుడును గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కలసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీని తన భుజాలపై మోస్తూ పార్టీలో ఉన్న అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ పార్టీ అభివృద్ధే లక్ష్యంగా, సంక్షేమమే ధ్యేయంగా శ్రమిస్తూ తెలుగువారికి చంద్రబాబు నాయుడు అండగా ఉన్నారన్నారు. కార్యకర్తలను ఎప్పటికప్పుడు కాపాడుకుంటూ పేదరికం లేని సమాజాన్ని నిర్మించటం కోసం చంద్రబాబు నాయుడు పడుతున్న శ్రమ మరువలేనిదన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

దాచేపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో రవి కుమార్ గురువారం తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

యోగాంధ్రలో నమోదు సర్వే వేగవంతం

పిడుగురాళ్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు, సాధారణ పౌరులతోపాటు యోగా పట్ల ఆసక్తి వున్న ప్రతిఒక్కరిని సచివాలయ ఉద్యోగులు నమోదు చేస్తున్నారు. గురువారం పిడుగురాళ్ల ఎంపీడీఓ కార్యాలయం, జడ్పీ హైస్కూల్ ప్రాంగణాలలో సచివాలయ ఉద్యోగులు, పట్టణ ప్రజలు, యోగా అభ్యాసకులు పాల్గొన్నారు.

1న ఓపెన్ చెస్ టోర్నమెంట్

పిడుగురాళ్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): లైమ్‌సిటీ చెస్ అసోసియేషన్ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వన్‌డే రాపిడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను జూన్ 1న జరపనున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు పెద్దలు, పిల్లలకు రెండు విభాగాలుగా చెస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ : 73866 53644లో సంప్రదించాలన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

మాచర్లటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూలై 5వ తేదీన మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు అదనపు సివిల్ జడ్జి పి.ప్రశాంత్ తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కడపలో జరిగిన మహానాడు కార్యక్రమానికి హాజరైన మాచవరం టీడీపీ శ్రేణులు

మహానాడులో మాచవరం టీడీపీ శ్రేణులు

మాచవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జరిగిన టీడీపీ మహానాడు కార్యక్రమానికి మాచవరం మండలం నుంచి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి యడ్లపల్లి రామారావు, మండల పార్టీ మాజీ కన్వీనర్ కొల్లి కృష్ణమూర్తులు ఇంకా పలు గ్రామాల నుంచి దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మహానాడు కార్యక్రమంలో పాల్గొని పార్టీ అభివృద్ధికి తమ సంఘీభావాన్ని తెలియ జేశారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

రాజుపాలెం, మే 29(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ అధికారి టీ మాధురి సూచించారు. మండలంలోని అనుపాలెం గ్రామంలో ఉన్న ఎస్సీ కాలనీలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్, యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి గురువారం సర్టిఫికెట్లు, యూనిఫాం అందజేశారు. డీబీఆర్సీ ఏరియా కోఆర్డినేటర్ కోటిరత్నం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంగీత, మురళి, ధనుశ్రీ తదితరులు ఉన్నారు.

సాగుకు వెనకడుగు

● నిరాశ, నిస్పృహల్లో రైతులు
● గతానుభవాలతో సాగుకు దూరం
● పడిపోయిన పొలాల కౌలు ధరలు



దాచేపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై రైతుల్లో నిరాశ, నిస్పృహ నెలకొంది. ప్రస్తుతం ఖరీఫ్‌కు పొలాలను సాగుకు సిద్ధం చయడంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో రైతులు పంట పొలాను దుక్కి చేయడం, గెనాల సిద్ధం చేసుకోవడంలో వంటి వ్యవసాయ పనుల్లో ముమ్మరంగా ఉంటారు. కానీ, ఈ సీజన్‌లో కర్షకుల్లో ఆ ఉత్సాహం కనిపించడం లేదు. గత అనుభవాలు వారిని వెన్నాడుతున్నాయి. సాగులో ఎదుర్కొన్న కష్టాలు, పంట చేతికొచ్చిన తర్వాత తెచ్చిన నష్టాలు కలవర పెడుతున్నాయి. సహజంగా పల్నాడు ప్రాంతంలో పత్తి, మిరప పంటలను అధికంగా పండిస్తారు. గత ఐదేళ్లుగా ఈ పంటలకు దిగుబడి ఉంటే.. ధర లేక పోవటం, ధర ఉంటే పంట దిగుబడి లేక పోవడం పరిపాటిగా మారింది.

దక్కని మద్దతు ధర.. నష్టాలే ఫలితం..

ఆరుగాలం శ్రమించి పండించిన మిర్చి పంటను ధర లేక గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. పత్తికి నిల్వ సౌకర్యం కూడా లేక అయిన కాడికి తెగనమ్మేశారు. పొగాకుది మరో పరిస్థితి. పల్నాడులో సెరీ రకం పొగాకును రైతులు సాగు చేశారు. పలు మార్లు గ్రేడింగ్ పేరుతో ఈ పంట కొనుగోళ్లు వాయిదా వేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కష్టపడి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని పండించినా.. పంట కొనే వారు లేక, నిల్వకు అవకాశాలు కనిపించక వారి బాధలు వర్ణనాతీతం. రెండేళ్ల క్రితం వరకు ఎకరం పొలం కౌలు రూ.15వేలు నుంచి రూ.20వేలు ఉండేది. ఈ ఏడాది రూ.5వేలు నుంచి రూ.10వేలు వరకు పడిపోయింది.

విస్తారంగా వర్షాలు



పిడుగురాళ్ల ప్రధాన రహదారిపై పారుతున్న వర్షపునీరు

పిడుగురాళ్ల, మే 29(ఆంధ్రజ్యోతి): గురువారం మధ్యాహ్నం నుండి కుండపోతగా 5గంటలపాటు భారీవర్షం కురిసింది. మధ్యాహ్నం 1 గంటకు మొదలుకొని సాయంత్రం 5వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. డ్రెయిన్స్ అన్నీ చెత్తాచెదారంతో నిండిపోవడంతో వర్షపునీరంతా ప్రధానరహదారులపైనే ప్రవహించింది. పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాల యం, ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. రైతులు ఈ వర్షంతో వ్యవసాయ పనులకు సమాయత్తమవుతున్నారు. పల్నా డు ప్రాంతమంతా గురువారం అధికవర్షం కురిసింది.

మాచవరం మండలంలో...

మాచవరం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. వేమవరం, చెన్నాయపాలెం, మాచవరం, పిన్నెల్లి తదితర గ్రామాల్లో సుమారు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో రైతుల్లో కొంత మేర ఆనందం వెల్లి విరిసింది. పొలాల సాగుకు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలో గురువారం మధ్యాహ్నం నుంచి జోరుగా వర్షం కురిసింది. పలు వీధుల్లో వర్షపు నీరు, మురుగునీరు రోడ్డుపై ప్రవహించింది. స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో వర్షపు నీరు నిలిచింది. తాలూకా సెంటర్, బైపాస్ రోడ్డు, వేణుగోపాల స్వామి దేవాలయ ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగునీరు రోడ్డుపై ప్రవహించింది. వర్షంతో చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు ఇబ్బందులుపడ్డారు.

రాజుపాలెం మండలంలో...

రాజుపాలెం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.. మండలంలో ఉన్న ఎద్దువాగు పొంగిపొర్లింది. రెడ్డిగూడెం గ్రామ సమీపంలో ఉన్న లో లెవల్ చప్టాపై వర్షపు నీరు నడుము లోతు పొంగిపొర్లింది. రెడ్డిగూడెం, దేవరంపాడు తదితర గ్రామాలలో సీసీ రోడ్లపై, ప్రధాన రహదారికి పక్కన వర్షపునీరు ప్రవహించింది. రెడ్డిగూడెం గ్రామ సమీపంలో పొలంలో ఆరబోసిన మిరపకాయలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. లోలెవల్ చప్టాపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహించటంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.

బెల్లంకొండ మండలంలో...

బెల్లంకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి లోలెవెల్ చప్టాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాగిరెడ్డిపాలెం నుంచి నందిరాజు పాలెం గ్రామానికి వెళ్ళే రహదారి మధ్యలో ఉన్న ఈ చప్టా వర్షపు నీటితో పొంగిపొర్లింది. బెల్లంకొండ ఎస్టీ కాలనీలోని లోతట్టు ప్రాంతం, జెడ్పీ పాఠశాల ఆవరణ అంతా వర్షపు నీటితో నిండిపోయింది. తహసీల్దార్ కార్యాలయ ఆవరణ వర్షపు నీటితో నిండిపోయింది.



వర్షం నీటిలో పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయ ఆవరణ

సత్తెనపల్లిలో చోరీ యత్నం

సత్తెనపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ చిల్లర దుకాణంలో చోరీయత్నం బుధవారం అర్ధరాత్రి జరిగింది. 31వ వార్డులో గల అబ్బూరు రోడ్డులో కొత్త వెంకట శ్రీనివాసరావుకు చిల్లర దుకాణం ఉంది. అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిబయట ఉన్న విద్యుత్ ఫీజును దొంగలు ముందుగా తొలగించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో శ్రీనివాసరావు తలుపు తీసి బయటకువచ్చాడు. అక్కడున్న ముగ్గురు దొంగల్లో ఒకరు విద్యుత్ ఫీజు మెటీరియల్‌తో గట్టిగా శ్రీనివాసరావును గాయ పరిచాడు. శ్రీనివాసరావు కేకలు వేయటంతో దొంగలు ముగ్గురు తాము తెచ్చుకున్న కారులో పరారయ్యారు. దీనిపై వెంకట శ్రీనివాసరావు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 29(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 21.75 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

వేంకటేశ్వరుని పుష్కర కుంభాభిషేకం

క్రోసూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరం కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ పుష్కర కుంభాభిషేక మహోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అంకురార్పణ, స్వామివారి ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, శాంతి హోమాలు, స్వామివారికి సహస్ర నామార్చనలు చేసినట్టు తెలిపారు.

మిర్చి టిక్కీల చోరీపై కేసు నమోదు చేయలేదు..

రైతు శివన్నారాయణ ఆరోపణ



గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులను చూపుతున్న రైతు శివన్నారాయణ

క్రోసూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన కడియం శివన్నారాయణ అనే రైతు తమ పొలంలోని మిర్చి టిక్కీలు చోరీకి గురయ్యాయని, ఈ విషయం గురించి క్రోసూరు పోలీసు స్టేషన్, ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు కేసు నమోదు చేయలేదని గురువారం ఆరోపించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 17వ తేదీన తమ పొలంలోని పది క్వింటాళ్ళ మిర్చి చోరీకి గురైందని, వాటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 18న దీనిపై క్రోసూరు పోలీసు స్టేషన్‌లో తమ గ్రామానికి చెందిన నలుగురిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదుచేశానని తెలిపారు. సీఐ ఆ నలుగురిని పిలిపించి మాట్లాడారని, తరువాత ఎటువంటి కేసు నమోదుచేయకుండా వదిలివేసి ఫిర్యాదు చేసినందుకు దుర్భాషలాడారని రైతు పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా నేటికీ పోలీసుల నుంచి స్పందన లేదని తెలిపారు. తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని వాపోయాడు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు స్వీకరించి విచారణ జరుపుతున్నామని తెలిపారు.

ఆరు నెలల క్రితం అత్యాచారం చేశాడంటూ ఫిర్యాదు

ముప్పాళ్ళ, మే 29(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల క్రితం తనపై అత్యాచారం చేశాడని పోలీసులు.. పట్టించుకోలేదని ఆరోపిస్తూ మహిళ సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్ వద్ద గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. బాధిత మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముప్పాళ్ళ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి రూరల్ మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన మహిళ ఆరునెలల క్రితం వైద్యం నిమిత్తం సత్తెనపల్లికి వచ్చి రాత్రి 8గంటల సమయంలో కంకణాలపల్లి వెళ్లేందుకు గడియారం స్తంభం వద్ద ఆటో కోసం ఎదురుచూస్తోంది. సత్తెనపల్లి రూరల్ మండలం భృగబండ్ల గ్రామానికి చెందిన తిరుపతయ్య టాటా ఏస్ వాహనంతో వచ్చి తాను భృగబండ్ల వెళుతున్నాను.. నిన్ను కంకణాలపల్లిలో దింపుతానని ఎక్కించుకున్నాడు. ముప్పాళ్ళ మండలంలోని కాల్వగట్టు వైపు తీసుకెళ్ళి ఆమెపై అత్యాచారం చేశాడని మహిళ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

కడప మహానాడులో కారంపూడి నేతలు



మహానాడులో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డితో కారంపూడి నేతలు

కారంపూడి, మే 29(ఆంధ్ర జ్యోతి): కడప మహానాడు ప్రాంగణంలో కారంపూడి నేతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వీరిలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మునుగోటి సత్యం, చప్పిడి రాము, మస్తాన్‌జాని, బొల్నేడి కోటేశ్వరరావు, బడిగొడుగుల లక్ష్మీనారాయణ యాదవ్, ఒప్పిచర్ల హరికృష్ణ, లక్ష్మయ్యతోపాటు 200 మంది కార్యకర్తలు ఉన్నారు.

1న స్వర నీరాజనం

మాచర్లటౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాపరిషత్, మాచర్ల ఆధ్వర్యాన జూన్ 1న స్వరనీరాజనం పాటల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. మానుకొండ కల్యాణ మండపంలో రాత్రి 7 గంటలకు జరిగే ఈ తెలుగు సినిమాపాటల పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల గాయనీ గాయకులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు వరుసగా మొదటి ఐదు స్థానాలలో, మరో 20 మందికి రూ.1000 చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీరామమూర్తి, గౌరవాధ్యక్షుడు డాక్టర్ ముటుకుల కమలాసన్ తెలిపారు. పాల్గొనదలచిన గాయకులు నిర్వాహక కమిటీ సభ్యులు మాగులూరి రాంబాబు సెల్: 95054 53457, పఠాన్ జాన్‌ఖాన్ సెల్: 95737 86029, పులుసు శ్రీనివాసరెడ్డి సెల్ : 98665 37346లను సంప్రదించాలని కోరారు.

31న పింఛన్ల పంపిణీ

కారంపూడి, మే 29 (ఆంధ్రజ్యోతి): జూన్ ఒకటో తేదీ ఆదివారం రావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 31వ తేదీన పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ పింఛన్ తీసుకునే ప్రతి ఒక్కరు ఈనెల 31వ తేదీన అందుబాటులో ఉండాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు.

ఒత్తిడి తగ్గాలంటే యోగా అవసరం

బెల్లంకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): ఒత్తిడి తగ్గాలంటే యోగా ఎంతో అవసరమని ఎంఈవో రాజకుమారి అన్నారు. గురువారం బెల్లంకొండలో ఎంఈవో కార్యాలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో యోగా శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బాలచందరరావు, ఆయుర్వేద వైద్యుడు శ్రీనివాస్, యోగా టీచర్ భూక్యా హనుమంతరావు నాయక్, కోటేశ్వరమ్మ, వెంట్రామయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా చంద్రబాబు ఎన్నికపై హర్షం

● ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 12వ సారి ఎన్నికకావడం సంతోషదాయకమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది తెలుగు రాష్ట్రాలలో పార్టీ బలోపేతానికి దోహదపడుతుందన్నారు. కడప సమీపంలో జరిగిన మహానాడు లక్షలాది మంది కార్యకర్తల నడుమ విజయవంతం కావడం పార్టీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిబద్ధతకు నిదర్శనమని యరపతినేని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండిలా పరుగులు తీస్తుందని, గురజాల నియోజకవర్గం నుండి పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో మహానాడుకు హాజరయ్యారని యరపతినేని తెలిపారు.

మహానాడుకులో టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే ప్రవీణ్ ఆతిథ్యం



మహానాడు వద్ద నాయకులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి) కడపలో జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుండి టీడీపీ నాయకులు తరలి వెళ్లారు. నియోజకవర్గం నుండి వెళ్లిన నాయకులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆతిథ్యం ఇచ్చి భోజనం వడ్డించారు. అనంతరం నాయకులతో ముచ్చటించారు. కడపలో జరిగిన మహానాడు స్ఫూర్తితో రానున్న రోజులలో టీడీపీ అభ్యున్నతికి ప్రజలకు అండగా నిలవాలని నాయకులను కోరారు.

మహానాడులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



మహానాడులో సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడులో గురువారం చివరి రోజు జరిగిన కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మహానాడుకు వచ్చినవారికి విందు భోజనాలు దగ్గరుండి వడ్డించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలసి ముచ్చటించారు. పెదకూరపాడు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో మహానాడుకు తరలివచ్చారని ఎమ్మెల్యే అన్నారు. మహానాడు ద్వారా రెట్టింపు ఉత్సాహంతో పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు.

ఆరు శాసనాలు ప్రగతికి సోపానాలు

● మహానాడును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మాచర్లటౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): కడప గడ్డపై పసుపు సైన్యం మహానాడు వేదికగా ప్రవేశపెట్టిన ఆరు శాసనాలు ప్రగతికి సోపానాలు అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించిన మహానాడు ఎంతో అద్భుతంగా జరిగిందన్నారు. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఎటువంటి లోటులేకుండా అన్ని ఏర్పాట్లు చేశారని హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడే పార్టీ టీడీపీ అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్ - 2047కు పిలుపునివ్వగా ఆయన సంకల్పం సఫలీకృతం అయ్యేందుకు పార్టీ ప్రధానకార్యదర్శి, ఐటీ శాఖా మంత్రి లోకేశ్ కార్యకర్తల అభ్యున్నతికి ఆరు శాసనాలను ప్రవేశపెట్టారని వివరించారు. మాచర్ల నియోజకవర్గం నుంచి కడప మహానాడుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే జూలకంటి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు పెన్షన్ పంపిణీ

దుర్గి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులకు ఈనెల 31వ తేదీన పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. శనివారం పెన్షన్‌దారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

1 నుంచి చౌక డిపోల్లో రేషన్ పంపిణీ

మండలంలోని చౌక డిపోల్లో జూన్ 1వ తేదీ నుంచి లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ ఫణీంద్రకుమార్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగుల గృహాల వద్దకు వెళ్లి రేషన్ అందించాలన్నారు.

● కారంపూడి: జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల్లో డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ గురువారం తెలిపారు. నిర్వాహకులు రేషన్ సక్రమంగా ఇవ్వకుంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

● రెంటచింతల: జూన్ 1 నుంచి రేషన్ డీలర్ల వద్దే నిత్యావసరాల పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ డి.మేరికనకం చెప్పారు. గురువారం వీఆర్వోలు, డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజాప్రతినిధులను ఆహ్వానించి రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి 12వరకు, సాయంత్రం 4గంటల నుంచి 8వరకు దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. సమావేశంలో డీటీ బ్రహ్మం, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.



కడప మహానాడులో టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ నేత మన్నెం శివనాగ మల్లేశ్వరరావు గురువారం కలిశారు.



కడపలో జరిగిన మహానాడులో పాల్గొన్న సత్తెనపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు, టీడీపీ నేతలు తాళ్ళ వెంకటేష్‌యాదవ్, కూచిపూడి సుబ్బారావు, జానీ ఖాజావలి, దివ్వెల శ్రీనివాసరావు తదితరులు

- సత్తెనపల్లి


'మహాసైకిల్'




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు

మహా జాతర













కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా మక్కెన

● అధికారిక ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

గుంటూరు, మే 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీబీ) ఛైర్మన్‌గా, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గురువారం అధి కారిక ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సహకార బ్యాంకు ఛైర్మన్‌లను గురువారం ప్రకటించింది. గత ప్రభుత్వంలో ఛైర్మ న్‌గా వ్యవహరించిన రాతంశెట్టి సీతా రామాంజనేయులు కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తొలి నాళ్ళలోనే తన పదవికి రాజీనామా చేసి తప్పుకున్నారు. నాటి నుంచి డీసీ సీబీ ఛైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. నామి నేటెడ్ ఛైర్మన్, పాలకవర్గ సభ్యు లు లేకపోవడంతో కొందరు అధి కారులదే పెత్తనం అయిపోయింది. దీం తో బ్యాంకులోని డిపాజిట్‌దారులు, సహకార సంఘాలు సభ్యులు తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. మరోవైపు జీడీసీ సీ బ్యాంకులో వైసీపీ హయాంలో జరిగిన అనేక కుంభకోణాలు వెలుగు లోకి వచ్చాయి. కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చి టిక్కీలకు రుణాల మం జూరులో పెద్ద గోల్‌మాల్ జరిగింది. వీటిపై విచారణలు కొనసాగు తున్నాయి. అయితే ఇప్పటివరకు ఎవరి పైనా చర్య తీసుకోలేదు. మరో వైపు ఉద్యోగులపై కేసులకు సిద్ధమవ ుతుండటంతో వారంతా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించటం చూడా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పాలకవర్గాలను నియమించింది. కాగా మంచి ముహూ ర్తం చూసుకొని జూన్ మొదటి వారం లో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వ హించనున్నట్లు ఛైర్మన్ వర్గీయులు తెలిపారు.

విత్తులో విపత్తు పసిగట్టాలి

తొలకరి వర్షాల పలకరింపు.. - ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం.. నాణ్యమైన విత్తన ఎంపికే.. శ్రీరామరక్ష

సత్తెనపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకుతున్నాయి. దీంతో సకాలంలో తొలకరి వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధ మవుతున్నారు. దీంతో సరైన విత్తనాన్ని ఎంచుకున్న ట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని, ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసా య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గతంలో అనేక సందర్భాల్లో రైతులు నకిలీ, నాసిరకం విత్తనా లను సాగు చేసి నష్టాలను చవిచూశారు. విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారులు ఏటా తనిఖీలు నిర్వహి స్తున్నా.. మార్కెట్‌లో నకిలీ విత్తనాల జోరు తగ్గడం లేదు. ఈ పరిస్థితుల్లో అన్నదాతలే విత్తన ఎంపికలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై తయారీ, పరీక్షించిన, గడువు తేదీలు సరిగా ఉన్నాయో లేవో సరి చూసుకోవాలి. విత్తనాల సంచులు చిరిగినా, రంధ్రాలు ఉన్నా.. అలాగే తడిచిన విత్తనాలను కొనుగోలు చేయకపోవడం మంచిది. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమ శాతం కూడా చూసుకోవాలి.

వలలో చిక్కుకోవద్దు

గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు అమ్మేవారితో రైతులు అప్రమత్తంగా ఉండాలి. కొన్ని నకిలీ కంపెనీలకు చెందిన విత్తనాలను.. బ్రాండెడ్ అంటూ ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో తప్పుడు ప్రచారం చేస్తుంటారు. ఆయా గ్రామాల్లోని పెద్ద మనుషులను సంప్రదించి.. రైతులందరూ విత్తనాలు కొనుగోలు చేసేలా ఒత్తిళ్లు చేస్తుంటారు. తక్కువ ధరకే ఇస్తామంటూ.. కొందరు లూజుగా విత్తన విక్రయాలు జరుపుతుంటారు. ధర తక్కువ అని ఆశ పడితే చివరికి నష్టాలు తప్పవు. ఇలాంటి వ్యక్తుల గురించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.



నిషేధిత విత్తనాలకు దూరంగా ఉండాలి

బీటీ -3 రకం పత్తి విత్తనాలు కొనుగోలు చేయకూడదు. వీటి సాగు పర్యావరణానికి పెను ముప్పు అని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ రకం పత్తి విత్తనాలు కొన వద్దని వ్యవసాయ శాఖ అధికారులు సూచించినప్పటికీ కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో గుట్టుగా విక్రయిస్తున్నారు. అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు అక్కడక్కడా రహస్యంగా ఈ విత్తనాలను సాగుచేస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

- శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ, సత్తెనపల్లి

ఖరీఫ్ సాగుకు విత్తన కొనుగోలులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు రసీదును తప్పనిసరిగా తీసుకుని, విత్తన నమూనా, ప్యాకెట్‌ను భద్ర పరుచుకోవాలి. నాసిరకం, నకిలీ కంపెనీల విత్తనాలు అమ్మే వ్యక్తులను గుర్తించి వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇస్తే.. చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి.. మోస పోతే.. పంట పూత దశలోనే అధికారుల దృష్టికి తీసుకురావాలి. శాస్త్రవేత్తల సూచనలతో నష్ట నివారణకు చర్యలు తీసుకుంటాం.

యోగాంధ్ర రిజిస్ర్టేషన్లకు పాట్లు

● ప్రతి సచివాలయానికి 50 శాతం ప్రజల టార్గెట్

● లక్ష్యం అధిగమించేందుకు ఇళ్లకు వెళ్లి మమ అనిపిస్తున్న సెక్రటరీలు

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో పాల్గొనేందుకు ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను అధిగ మించేందుకు గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు పడరాని పాట్లు పడుతున్నారు. గత వారం నుంచి ఉన్న తాధికారుల ఒత్తిళ్లు పెరిగిపోవడంతో అన్ని పనులను పక్కన పడేసి వారి పరిధిలో ఇంటింటికి వెళ్లి అందరిని యాప్‌లో నమోదు చేస్తున్నారు. మీరు యోగా నిత్యం చేస్తారా... ఎక్కడ యోగాసనాలు నేర్చుకొంటా రు... జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఎక్కడ పాల్గొంటారు.. వంటి అనేక ప్రశ్నలు వేసి చివరికి ఫోన్ నంబరుకు ఓటీపీ పంపించి దానిని నమోదు చేసి రిజిస్ర్టే షన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. సచివాలయం పరిధిలో 3 వేల మంది నివసిస్తుంటే 1,500 మందిని కనీసం రిజిస్ర్టేషన్ చేయాలన్న అధికారుల ఆదేశాల మేరకు సెక్రటరీలు ప్రస్తుతం ఈ పనిలో నిమగ్నమయ్యారు.

యోగాపై అవగాహన తక్కువ..

అంతర్జాతీయ యోగా దినోత్సవం వచ్చే నెల 21న విశాఖపట్టణంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఈ నేపథ్యం లో యోగాపై అవగాహన కార్యక్రమాలు ఇప్ప టికే జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నాయి. యోగాపై అవ గాహన పెంచేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే యోగా నిత్యం ఆచరించే వారి సంఖ్య తక్కువగా ఉంది.

అన్ని పనులు పక్కకు..

కాగా, ఇప్పుడు సచివాలయాల కార్యదర్శులు కేవలం తమకు ఇచ్చిన టార్గెట్‌లను పూర్తి చేసేందుకు ప్రతీ ఒక్క రిని యోగా దినోత్సవం కోసం రిజిస్ర్టేషన్ చేయిస్తున్నారు. ప్రజల వద్దకు వెళ్లి అసలు విషయం చెప్పకుండా సర్వే అని చెబుతూ వాళ్లంతటికి వాళ్లే యాప్‌లో ఖాళీలు నింపేసి రిజిస్ర్టేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. రాష్ట్రం మొత్తం మీద యోగాంధ్ర-2025లో 2 కోట్ల మంది పాల్గొనేలా చేయాలని టార్గెట్ కావడంతో ఆ దిశగా రిజిస్ర్టేషన్లను పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామ/వార్డు సచివాలయాల్లో రేషన్‌కార్డు సర్వీసుల కోసం దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వస్తుండగా వాటిని పక్కన పెట్టేశారు. ఎవరైనా సచివాలయానికి వెళితే ముందు యోగాంధ్రలో రిజిస్ర్టేషన్ చేయించుకోండని మెలిక పెడుతున్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జీ బీ సాయికళ్యాణ చక్రవర్తి

గుంటూరు(లీగల్), మే 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్ట్ ప్రాంగణాల్లో జూలై 5 న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కక్షిదా రులు తమ తమ వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకొని లబ్ధి పొందాలని జిల్లా జడ్జీ బీ సాయికళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో సివిల్ కేసులు (పార్టిషన్ దావాలు, ప్రోనోటు దావాలు, పర్మనెంట్ ఇంజెక్షన్ దావాలు, అగ్రిమెంట్ లకు



సంబంధించిన స్పెసిఫిక్ పెర్ఫార్మన్స్ దావాలతోపాటు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో వారు ఇచ్చిన సర్కులర్ ప్రకారం కొన్ని రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూ సేకరణకు సంబంధించిన నష్టపరిహారం కేసులు, ప్రీ-లిటిగే షన్ కేసులు పరిష్కరించటం జరుగుతుందని, తెలిపారు. కక్షిదారులు, పోలీస్ వారు, బ్యాంక్, ఇన్సూరెన్స్ కంపెనీల అధికా రులు, న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఈ జాతీయ లోక్ అదా లత్ నందు ఎక్కువ కేసులు రాజీ మార్గం లో పరిష్కారానికి సహకరించాలని కోరారు.


సమీక్షలో పాల్గొన్న ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

ఎన్‌హెచ్-544డీ జేఎం సర్వే చేపట్టాలి

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఎన్‌హెచ్-544డీకి సంబంధించి గుంటూరు జిల్లాలో జాయింట్ మెజర్‌మెంట్ సర్వేని వెంటనే ప్రారంభించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ ఆదేశించారు. వినుకొండ నుంచి గుంటూరు వరకు నాలుగు లైన్ల రహదారి కొనసాగింపులో భాగంగా దీనిని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ విస్తరించబోతున్నదన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఈ రహదారి అంశంపై ఆయన ఎన్‌హెచ్ఏఐ, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి ఎన్‌హెచ్-544డి గుంటూరు వరకు నాలుగు లైన్ల రహదారిగా కొనసాగింపునకు సంబంధించి 18 కిలోమీటర్లు జిల్లా పరిధిలోని మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలలో ఉందన్నారు. రహదారి విస్తరణ సంబంధించి ఇప్పటికే భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, దీనిపై వచ్చిన రెండు అభ్యంతరాలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాలు పక్కకు తరలించడానికి విద్యుత్ శాఖ అధికారులు, పైపులైన్లు, కాలువలకు సంబంధించి ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో అంచనాలు తయారు చేయించాలన్నారు. అదేవిధంగా రహదారి విస్తరణ వల్ల నిర్మాణాలు కోల్పోతున్న వారికి అందించాల్సిన నష్టపరిహారం పైన ఆర్‌అండ్‌బీ అధికారులతో అంచనాలను సిద్ధం చేయించాలన్నారు. రెవెన్యూ అధికారులు సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకొని జాయింట్ మెజర్మెంట్ సర్వే ద్వారా సోమవారం నుంచి ఎస్టిమేషన్ సిద్ధం చేసే పనులను ప్రారంభించి, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్‌ఎస్‌కే ఖాజావలి, జాతీయ రహదారుల పీడీ పార్వతీశం, ఆర్డీవో కే శ్రీనివాస రావు, ఫిరంగిపురం, మేడికొండూరు తహశీల్దార్లు ప్రసాద రావు, హరిబాబు, కలక్టరేట్ జి సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణంలో భద్రత కట్టుదిట్టం

● సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతకు సంబంధించి నిర్దే శించిన నిబంధనలన్నీ రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు సంస్థలు పాటించాలని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ సూచించారు. రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతల పర్యవేక్షించే విషయం గురించి విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో గుత్తే దారు సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని నిర్మాణపనుల్లో బాలకార్మికులు, లింగవివక్షకు తావులేదన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, కార్మికుల భద్రతకు సంబంధిం చిన అంశాలలో పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో సమన్వయం చేసు కుంటూ సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు, మే నేజ్మెంట్ కన్సల్టెన్సీ, సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. ప్రతినెలా అమరావతిలోని అన్ని సైట్లలో క్రైమ్ మిటిగేషన్, ఫైర్‌సేఫ్టీపై పోలీస్, ఫైర్ డి పార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన, శిక్షణ నిర్వహిస్తామన్నారు. రాజధా ని పనుల్లో పాలుపంచుకుంటున్న కార్మి కుల వివరాలు, వినియోగిస్తు న్న ట్రక్కులు, జేసీబీలు తదితర యంత్రాల వివరాలను నమోదు చేసుకుం టూ పోలీస్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీశ్‌తో పాటు ఇతర అధికారులు స మావేశంలో చేసిన సూచనలు, అంశాలను ప్రణాళికాబ ద్ధంగా అమలుచేస్తామన్నారు. సీఆర్డీఏ చీఫ్ ఇంజినీర్లు డి.శ్రీరామచంద్ర మూర్తి, ధనుంజయ, ఎన్.శ్రీనివాసులు, సీఆర్డీఏ, ఏడీసీఎల్‌లోని వివిధ విభా గాల అధికారులు, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, తుళ్లూరు పీఎస్ ఎస్‌డీ పీవో మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవీడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొండవీడు, కొత్తపాలెం, సొలస, లింగారావుపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహించాల్సి ఉన్నందున ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖవారికి సహకరించాలని కోరారు.

ముగ్గురి బైండోవర్

ఈపూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం కేసుల్లో ముగ్గురిని గురువారం బైండోవర్ చేసినట్లు సీఐ డీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈపూరు మండలం భద్రుపాలెంకు చెందిన ఇద్దరు, రొంపిచర్ల గ్రామానికి చెందిన ఒకరిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు. నాటుసారా, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలపై సమాచారం తెలియజేయాలని ప్రజలను కోరారు.

అంకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రొంపిచర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలోని అంకమ్మతల్లి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారి కొలుపుల సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు పేటేటి హరి అమ్మవారికి అభిషేకాలను నిర్వహించారు. అమ్మవారి వీరతాళ్ళు ఊరేగింపు జరిగింది.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

కనమర్లపూడి (శావల్యాపురం) మే 28 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుర్రంవారిపాలెంకు చెందిన దావులూరి శివ బైకుపై శావల్యాపురానికి వెళుతుండగా నరసరావుపేట నుంచి వినుకొండ వెళుతున్న షేక్ మీరావలి కుటుంబ సభ్యులు, కనమర్లపూడి గ్రామ సమీపంలోని గుర్రంవారిపాలెం కూడలి వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. శివ కాలికి గాయమైంది. మీరావలి తలకు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. బైకుపై ఉన్న ఇద్దరు పిల్లలు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108సిబ్బంది క్షతగాత్రులను వినుకొండలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వినియోగదారులకు అవగాహన

చిలకలూరిపేట, మే29 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ఆధ్వర్యంలో పెట్రోలు కొనుగోలు చేసినప్పుడు ఎలా వ్యవహరించాలో తెలియచేసి వినియోగదారులకు గురువారం కరపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా పరిరక్షణ ఫోరం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువు, నాణ్యత, ధరలను ప్రశ్నించే హక్కు వినియోగదారులకు చట్టం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఫోరం ఉపాధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రవినాయక్, కోశాధికారి బేబీ విక్రమ్, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు నందిపాటి రవి, ఏం పుష్పవల్లి, తూబాటి సుభాని తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం

పెనుగంచిప్రోలు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పల్నాడు జిల్లా నర్సరావుపేట ఐలా బజారుకు చెందిన సుంకర శ్రీనివాస్-మాధురి దంపతులు రూ.50,116 విరాళాన్ని ఏఈవో తిరుమలేశ్వరరావుకు అందించారు. దాతలకు అమ్మవారి, స్వామివారి శేషవస్త్రాలు ప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

వినుకొండ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవరం, గోకనకొండ గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధించాలంటూ గురువారం డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ మండల కో ఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి సందీప్, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేటినుంచి కొలుపులు ప్రారంభం

గుంటుపాలెం (శావల్యాపురం) మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటుపాలెంలో ఉన్న నాగార్పమ అమ్మవారి దేవాలయం వద్ద మూడ్రోజుల పాటు జరగనున్న కొలుపులు మహోత్సవం శుక్రవారం ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ 30న అమ్మవారికి సముద్ర స్నానం, 31న మాతుడుపు, అమ్మవారి సంబరం, జూన్ 1న అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఉప్పరపాలెంలో ...

ఈపూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెంలో శుక్రవారం నుంచి పోలేరమ్మ కొలుపులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించడంతో కొలుపులు ముగుస్తాయన్నారు.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా: ఈఈ సీహెచ్ రాంబొట్ల

ఈపూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ ఏర్పాటుతో విద్యుత్ ఆదాతో పాటు ఆర్థికంగా లబ్ధి పొందవచ్చునని నరసరావుపేట డివిజన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రాంబొట్ల అన్నారు. ఈపూరు విద్యుత్ సబ్‌స్టేషన్ గురువారం ఆయన సందర్శించారు. మొండి విద్యుత్ బకాయిలను వసూళ్లపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఈ ఎస్.గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో ముండ్రువారిపాలెం పాఠశాల



తరగతి గదిలో పెచ్చులూడుతున్న శ్లాబు, గోడలు

- ▸▸ పెచ్చులూడుతున్న శ్లాబు
- ▸▸ వర్షం వస్తే నీరు కారుతున్న గదులు
- ▸▸ భయపడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



శిథిలావస్థలో ఉన్న ముండ్రువారిపాలెం పాఠశాల

ముండ్రువారిపాలెం (శావల్యాపురం) మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్రువారిపాలెంలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారింది. తరగతి గదులలో శ్లాబు, గోడలకు పెచ్చులూడిపోయి ఇనుప ఊచలు బయటపడ్డాయి. వర్షం కురిసిన ప్రతిసారీ పాఠశాల కారుతుండడంతో విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మొత్తం మూడు గదులుండగా పాఠశాల, అంగన్ వాడీ కేంద్రం, వంటశాలలకు వినియోగిస్తున్నారు. పాఠశాలలో 18మంది, అంగన్ వాడీకేంద్రంలో 15మంది విద్యార్థులున్నారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలకు పిల్లల్ని పంపాలంటే తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. 2021లో ఇదే పాఠశాల్లో 38మంది విద్యార్థులుండగా క్రమేపీ తగ్గుతూ ప్రస్తుతం 18మందికి చేరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాఠశాలకు అదనపు తరగతి గదిని మంజూరు చేయగా కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించక పనులు పూర్తి చేయలేదు. గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల్లో చేపట్టిన మొదటి విడత నాడు-నేడు పనులకు ఎక్కువ పిల్లలున్న ఈ పాఠశాలను ఎంపిక చేయకుండా ఎస్సీ కాలనీలో తక్కువ పిల్లలున్న పాఠశాలను ఎంపిక చేయడంతో ఈ దుస్థితి నెలకొందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. మూడో విడతకు ఈ పాఠశాలను ఎంపిక చేసినా పనులు ప్రారంభం కాలేదు. విషయాన్ని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవటం లే దని గ్రామస్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా ప్రత్తిపాటి జన్మదిన వేడుకలు



తిరుమలలో జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి



తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని వస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

చిలకలూరిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన సందర్భంగా గురువారం పట్టణంలో పలుచోట్ల టీడీపీ శ్రేణులు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రత్తిపాటి గార్డెన్స్‌లో జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి వైద్య పరీక్షలకు హాజరైన వారి సమక్షంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జవ్వాజి మదనమోహన్, కామినేని సాయిబాబు, ఆర్టీసీ కంచర్ల శ్రీనివాసరావు, జనసేన నేత తోట రాజారమేష్, డాక్టర్ కొమ్మినేని వీరశంకరరావు, డాక్టర్ ముప్పాళ్ళ హనుమంతరావు, డాక్టర్ చాపలమడుగు రామకృష్ణ, పార్టీ నాయకులు దగ్గుమల్లి సాంబశివరావు, జమాల్ బాషా, కక్కెర నాగేశ్వరరావు, షేక్ అజహరుద్దీన్, అబ్దుల్ మజీద్, తుపాకుల అప్పారావు, పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్లు భారీ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మరో కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను బహూకరించారు. పారిశుధ్య కార్మికులతో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ అబ్దుల్‌రహీం, మునిసిపల్ కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, సాయి తిరుమల, కూనల ప్రమీల, కొత్త కుమారి, రాయని హరిత, కంచర్ల కరుణ, జంగా సుజాత పాల్గొన్నారు. స్టీలు కొట్ల బజారులో భాస్కర్ ఫ్యాన్సీ వద్ద ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో 100కిలోల లడ్డు జున్ను కేకును కట్ చేసి పార్టీ నాయకులకు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆర్యవైశ్యులకు, వర్తకులకు ఎల్లవేళలా అండగా ఉంటూ అన్ని విధాలా తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కనమర్లపూడి రమేష్, వెల్లంపల్లి రవిశంకర్, గ్రంధి భాస్కరరావు, అమరా రమాదేవి తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేట సెంటర్లో ఉన్న అన్న క్యాంటీన్లో పార్టీ నాయకులే టోకెన్ల బిల్లు మొత్తం చెల్లించి అల్పాహారం, భోజనాలను ఉచితంగా అందించారు. 24వ వార్డులో అమీనియా మసీదు వద్ద కేక్ కటింగ్ కార్యక్రమం జరిపి అనంతరం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యద్ మస్తాన్ వలీ, సాంబయ్య, మహమ్మద్ అలీ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బిస్కెట్లు, పండ్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు, జీవీహెచ్ఎస్ ప్రసాద్, కొండ్రగుంట రామకృష్ణ, ఈపూరి బ్రహ్మానందం, షేక్ సైదావలి, శామ్యూల్ జాన్ పాల్గొన్నారు. శ్రీ పద్మావతి గోదా సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పట్టణ ఆర్యవైశ్య కమ్యూనిటీ వారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 32వ వార్డు పరిధిలో ఉన్న సుగాలి కాలనీలో రామాలయంలో ఆ వార్డు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి వార్డు ప్రజలకు పంపిణీ చేశారు. అంకిరెడ్డి రమేష్ నాయుడు మిత్రమండలి ఆధ్వర్యంలో కూడా భారీఎత్తున పుల్లారావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జంగ వినాయకరావు, షేక్ రియాజ్, మల్లెల శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అద్దంకి వరప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రయాణికులకు కేక్ పంపిణీ చేశారు. కావూరులో సుమారు వెయ్యి మందికి టీడీపీ నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాలెంపాటి రామారావు, మద్దాలి హరిప్రసాద్, నాయుడు చిన్న తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ప్రత్తిపాటి సమక్షంలో..

చిలకలూరిపేట నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు గట్టినేని విజయ సాయి ఆధ్వర్యంలో తిరుపతిలో ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాటి శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వెళ్లారని తెలుసుకున్న నేతలు నేరుగా తిరుపతి వెళ్లి అక్కడే ఆయన సమక్షంలోనే ఘనంగా పుట్టినరోజు వేడుక నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను ప్రత్తిపాటితో కట్ చేయించారు. అనంతరం ప్రత్తిపాటిని పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మల్లెల రాజేష్ నాయుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నేతలు గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, తూబాటి శ్రీహరి, పిల్లి కోటి, పసుమర్రు జానీ, కోటపాటి అనిల్, జవ్వాజి హర్ష, పొన్నం శివ, బేరింగ్ నాగూర్, గంగన్నపాలెం చందు, షేక్ జానీ, చందు, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని శ్రీవేంకటేశ్వరుని వేడుకున్నానని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం తెలిపారు. తన జన్మదినం సందర్భంగా తిరుమలలో శ్రీవారిని దర్శించుకొని, స్వామివారి సేవల్లో ఆయన పాల్గొన్నారు. స్వామివారి దర్శనానంతరం తిరుమల మాడవీధుల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ పురోగతి సాధనకు అవసరమైన శక్తియుక్తుల్ని ముఖ్యమంత్రికి ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్తిపాటి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్తిపాటి వెంట నియోజకవర్గ టిడిపి నాయకులు కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, సాంబశివరావు తదితరులున్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ విజయశ్రీ

యడ్లపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో గురువారం యడ్లపాడు ఎంపీడీవో కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్నందున యడ్లపాడులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటుకు సహకరించిన తహసీల్దార్, ఎంపీడీవో హేమలతాదేవిలకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. రక్తదానం చేసిన వారికి తహసీల్దార్, ఎంపీడీవోలు పళ్ళు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను, దాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి మురళీకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు సాయిబాబు, టీడీపీ నాయకులు పోపూరి వెంకయ్య, ప్రసాదు, హరిబాబు, ఆర్ఐ సుబ్బారావు, డీటీ అనూరాధ, ఎస్ఐ శివరామకృష్ణ, ఈవోపీఆర్డీ జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ప్రధానోపాధ్యాయుల బదిలీ

శావల్యాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి, మతుకుమల్లి జడ్పీ పాఠశాలలో హెచ్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరావు, కృష్ణతులసిలు ఇద్దరూ బదిలీ కానున్నట్లు మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు గురువారం తెలిపారు. ఉమామహేశ్వరరావు తెనాలి వద్దనున్న బుర్రిపాలెం జడ్పీపాఠశాలకు, కృష్ణతులసి గుంటూరు వద్దనున్న పొత్తూరు జడ్పీపాఠశాలకు బదిలీ కానున్నట్లు తెలిపారు. వారిస్థానంలో కొత్త హెచ్ఎంలు ప్రభుత్వం త్వరలో నియమించనుందని తెలిపారు.



బీఆర్ఎస్ జవాన్ పఠాన్ గౌస్ దంపతులను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న

బీఎస్ఎఫ్ జవాన్ పఠాన్ గౌస్‌కు సన్మానం

నరసరావుపేట టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఇండియా-పాకిస్థాన్ యుద్ధంలో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని స్వస్థలం నరసరావుపేటకు వచ్చిన బీఎస్ఎఫ్ జవాన్ పఠాన్ గౌస్‌కు సత్కారం జరిగింది. పఠాన్ గౌస్ ఉద్యోగ విరమణ చేసిన కానిస్టేబుల్ సుభాని కుమారుడు. పెన్షనర్ల సంఘం పల్నాడు జిల్లా శాఖ నరసరావుపేట వారి ఆధ్వర్యంలో గురువారం సంఘం భవనంలో పఠాన్ గౌస్ దంపుతులను ఘనంగా సన్మానించారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ జవాన్ పఠాన్ గౌస్ మాట్లాడుతూ బోర్డరులోని విషయాలు వివరిస్తూ, దేశం కోసం దేనికైనా సిద్ధమేనని చెప్పారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు లంకా రంగనాయకులు, ఉపాధ్యక్షుడు చేగిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి, సెక్రటరీ సీసీ ఆదెయ్య, ట్రెజరర్ ఎంఎస్ఆరోకే ప్రసాద్, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, దాసరి ఫ్రాంసిస్, రాజేశ్వరరావు, అంబటి మాధవరెడ్డి, షేక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

కడప దర్గాను సందర్శించిన చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యే అరవిందబాబు



దర్గాను దర్శించుకున్న జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే డాక్టర్‌చదలవాడ, మహాసేన రాజేష్ తదితరులు

వినుకొండ, నరసరావుపేట టౌన్ మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన కడప నగరంలోని అమీన్ పీర్ (పెద్ద దర్గా)ను ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్ద దర్గాలోని హజరత్ పీరుల్లామాలిక్ సాహెబ్ మజార్‌ను దర్శించుకొని చాదర్ సమర్పించి దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేన్ ఆశీస్సులు తీసుకున్నారు. జీవీతో పాటు మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, నక్కా ఆనందబాబు, డీసీసీబీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు ప్రార్థనలు నిర్వహించారు.

ఎమ్మెల్యే అరవిందబాబు...

(ఆంధ్రజ్యోతి): కడపలో ప్రసిద్ధిగాంచిన అమీన్ పీర్ దర్గా (కడప దర్గా), కడప ఒంటిమిట్ట కోదండ రామాలయంను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు దంపతులతో పాటు దర్గాను మహాసేన రాజేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు దర్శించుకున్నారు. మహానాడు ప్రాంగణంలో తెలుగుదేశం జెండాలతో ఉన్న ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నడిపి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పులిమి వెంకట రామిరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



సుబ్బగురు యోగేంద్ర స్వామి మూల విరాట్, వెల్లటూరులో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ

ఘనంగా సుబ్బగురు యోగేంద్ర స్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరులో సుబ్బగురు యోగేంద్రస్వామి తిరునాళ్ల గురువారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ నాలుగు భారీ విద్యుత్ ప్రభలు రెండు పాట కచేరీలు, వాటిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. టీడీపీ ఆధ్వర్యంలో మూడు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. తిరునాళ్ళ సందర్భంగా ఎస్ఐ ఏ బాలకృష్ణ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈపూరులో ఎల్ఈడీ స్క్రీన్‌పై మహానాడు లైవ్

ఈపూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు సభను చివరి రోజు గురువారం మండల కేంద్రమైన ఈపూరులో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. లైవ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రసంగాలను ప్రజలు ఆసక్తిగా విన్నారు. మహానాడు సభకు వెళ్ళలేని నాయకులు, కార్యకర్తలు స్క్రీన్‌పై చూస్తూ ఆనందాన్ని వెలిబుచ్చారు.